క్లుప్తంగా

హుండీల ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న దేవదాయశాఖ అధికారులు

గజపతినగరం: మండలంలోని దావాలపేట మహంకాళీ అమ్మవారి ఆలయంలో దేవదాయశాఖ విజయనగరం డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.వి.లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం హుండీ లెక్కించారు. అమ్మవారికి భక్తులు హుండీలో కానుకగా సమర్పించిన ఆదాయం రూ.2,12,668 వచ్చిందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో అమ్మవారి దేవస్థానం చైర్మన్ పి.చిన్నంనాయు డు, స్థానిక సర్పంచ్ బూడి జ్యోతి, ఆలయ ఈఓ కరి శ్రీరామ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పోలీస్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ జిల్లా కార్యదర్శిగా బంగారునాయుడు



కె.బంగారునాయుడు

శృంగవరపుకోట: పీఆర్టీయూ జిల్లా శాఖ కార్యదర్శిగా ఎస్.కోట మండలంలోని సంతగవిరమ్మపేట గ్రామ యూపీ స్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న కె.బంగారునాయుడు నియమితులయ్యారు. మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు తనని పీఆర్టీయూ జిల్లా కార్యద ర్శిగా ప్రకటించారని, ఆయన నిర్ణయాన్ని పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.అశోక్‌రాజు, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు కె.మోహన్‌రాజ్, ఎస్.కోట మండలశాఖ అధ్యక్షుడు జి.సూరిబాబు తదితరులు ఆమోదించారని బంగారునాయుడు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

సులభంగా అర్థమయ్యేలా బోధన



హెచ్‌ఎంలకు సూచనలు చేస్తున్న ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని ఎంఈఓలు విమలమ్మ,సాయిచక్రధర్ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యా యులకు సూచించారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో హెచ్‌ఎంలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓలు మాట్లాడు తూ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం పాఠశాలల రూపురేఖలు మార్చిందని, విద్యా విధానంలోనూ మార్పులు తీసుకువచ్చిందని చెప్పారు. విద్య బోధనలో ప్రభుత్వమార్గదర్శకాలను ఉపాధ్యాయులు పాటించాలని సూచించారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల వర్క్, నోట్ పుస్తకాలను తనిఖీ చేయాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన తప్పనిసరి



పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేస్తున్న డీఆర్‌ఓ అనిత, తదితరులు

విజయనగరం అర్బన్: మహిళలు, యువతకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగించాలని డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత అన్నారు. రిజర్వ్‌బ్యాంక్ సూచనల మేరకు సోమవారం నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యతపై వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఆర్‌బీఐ రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాలు 2016 నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 'మేక్ ఏ రైట్ స్టార్ట్స్ – బికమ్ ఫైనాన్షియల్లీ స్మార్ట్' అనే నినాదంతో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించి నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. సహాయ కలెక్టర్ త్రివినాగ్, ఆర్‌డీఓ సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్లు సుమబాల, మురళీకృష్ణ, ఏఎల్‌డీఎం ప్రత్యూష, పశుసంవర్థక శాఖ జె.డి విశ్వేశ్వరరావు, మెప్మా పీడీ సుధాకర రావు, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మేళా ప్రారంభం రేపు

నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ వర్సిటీలో ఏర్పాటు చేయనున్న కిసాన్‌మేళాను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం ప్రారంభిస్తారని వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి తెలిపారు. వర్సిటీ ఆవరణలో సోమవారం మాట్లాడుతూ.. స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్, కిసాన్ మేళా కార్యక్రమాలను రెండు రోజుల పాటు నిర్వహిస్తామని, ఇందుకోసం 34 స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

వాణిజ్యాభివృద్ధికి పూర్తి సహకారం

- జిల్లా కేంద్రంలో ఉండే సౌకర్యాలన్నీ చీపురుపల్లిలో కల్పించాం
- జీఎంఆర్‌ను ఆదర్శంగా తీసుకుని ఎదగాలి
- వైఎస్సార్ హయాంలోనే వైశ్యులను బీసీలో చేర్చేందుకు అంకురార్పణ
- వైశ్యవర్తక సంఘం సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ



మంత్రి బొత్సకు జ్ఞాపిక అందజేస్తున్న వైశ్య ప్రముఖులు

చీపురుపల్లి: వాణిజ్య, వ్యాపార పరంగా వైశ్యవర్తక సంఘానికి తమ పూర్తి సహకారం నిరంతరం ఉంటుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని వైశ్య వర్తక సంఘ భవనంలో సోమవారం చీపురుప ల్లి వైశ్యవర్తక సంఘంతో పాటు వైశ్యకులస్తులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చీపురుపల్లి పంచాయతీ అయినప్పటికీ జిల్లా కేంద్రంలో ఉండే సదుపాయాలు, సౌకర్యాలన్నీ ఇక్కడ కల్పించా మన్నారు. మున్సిపాలిటీలు, మహానగర పాలక సంస్థల్లో మాత్రమే ఉండే ఇంటింట కుళాయిల పథకాన్ని దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సహకారంతో చీపురుపల్లిలో రెండు దశాబ్దాల క్రిత మే సాకారం చేసుకున్నామ ని గుర్తు చేశారు. చీపురుపల్లి పట్టణం వాణిజ్యపరంగా మరింత అభివృద్ధి చెందినప్పుడే పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. వాణిజ్యపరంగా ఎలాంటి అభివృద్ధికి వైశ్యవర్తక సంఘం ముందుకొచ్చినా సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామ ని చెప్పారు. జనరేషన్ మారిన నేపథ్యంలో ఇంకా పాత వ్యాపారాలు కొనసాగించడం కంటే ప్రస్తుత జనరేషన్‌లో ఉన్న పిల్లలకు వ్యాపారపరంగా తల్లిదండ్రులు ఫ్రీడమ్ ఇవ్వాలని సూచించారు. పక్కనే రాజాంలో జన్మించి దేశంలోనే ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఎదిగిన జీఎంఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన కారణంగానే రాజాం పట్టణం ఎంతో అభివృద్ధి సాధించిందన్నా రు. దాదాపు మూడు దశాబ్దాలుగా ఇక్కడ వైశ్యులతో సన్నిహితంగా ఉంటున్నామని, మీకు ఎప్పు డు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు తాము ముందున్నామని గుర్తు చేశారు. ప్రజాసేవను ఆషామాషీగా కాకుండా ఛాలెంజ్‌గా తీసుకుంటామని అన్నారు. వైశ్య కులస్తుల్లో 140 పేద కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసి పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేసిందన్నారు. జిల్లా కేంద్రాన్ని తలదన్నే రీతిలో వాణిజ్య పరంగా చీపురుపల్లిని అభివృద్ధి చేసేందుకు వైశ్యులు తమతో కలిసి రావాలని కోరారు. దివంగత మహానేత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వైశ్యులను బీసీల్లో చేర్చేందుకు అంకు రార్పణ జరిగిందని గుర్తు చేశారు.

రెండు దశాబ్దాలుగా వైశ్యులతో మమేకం

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ చీపురుపల్లిని వాణిజ్య కేంద్రంగా తయారు చేసుకునేందుకు వర్తక సంఘం ముందుకు రావాలని కోరారు. ప్రస్తుత కాలంలో వాణిజ్య అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో సహకారం అంది స్తుందన్నారు. రెండు దశాబ్దాలుగా వైశ్యులతో మమేకమై ఉన్నామని, వారికి ఎప్పుడు ఎలాంటి అవసరం, కష్టం వచ్చినా ఆదుకున్నామని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు.

వైశ్యులను ఓబీసీలో చేర్చేందుకు కృషి

సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైశ్య కులస్తులను ఓబీసీల్లో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. స్థానిక వైశ్యుల కుటుంబాల్లో పలువురు పేదలకు అంగన్‌వాడీ, వాలంటీర్, ఏఎన్‌ఎం ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. కరోనా బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొన్న వారికి ఆస్పత్రుల్లో చేర్పించి వైద్యం అందించామన్నారు. అదే కరోనా సమయంలో గతంలో ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యేగా పని చేసిన వారు డాక్టర్ అయి ఉండి కూడా ఎవరినీ పట్టించుకోకుండా వైజాగ్ వెళ్లిపోయారని గుర్తు చేశారు. ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొత్స సందీప్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, ప్రముఖ వైద్యులు డాక్టర్ టి.నీలకంఠేశ్వర రావు, వైశ్యవర్తక సంఘం ప్రతినిధులు సూరు కామేష్, కింతలి శ్రీనివాసరావు, ఎస్.వి.జి.శ్రీనివాస రావు, సూరు కుమార్, కింతలి మధు, సుంకరి తిరుమల తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిర్ణయాలతో రవాణా వ్యవస్థ మెరుగు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ, తదితరులు

- ఎమ్మెల్సీ రఘువర్మ

చీపురుపల్లి: కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు రైల్వేస్టేషన్లు, రహదారుల అభివృద్ధికి దోహదపడుతున్నాయని పీడీఎఫ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా చీపురుపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.14 కోట్ల నిధులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఆ నిధులతో రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. రైలు మార్గాలు, జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. రవాణా వ్యవస్థ మెరుగుపడినప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఎంపీగా ఉన్న తన తండ్రి బెల్లాన చంద్రశేఖర్ చొరవతో చీపురుపల్లిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.13 కోట్లు నిధులు మంజూరయ్యాయని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ పనులు చురుగ్గా జరుగుతున్నాయి చెప్పారు. ఈ సందర్భంగా చీపురుపల్లి, గరివిడి పట్టణాల్లోని పలు పాఠశాలల్లో 'దేశ అభివృద్ధిలో రైల్వే పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఈశ్వరరావు, రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఇప్పిలి నీలకంఠం, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్.ఎస్.రాజు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమోఘం



వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: ప్రభుత్వానికి , ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ వలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘమని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండలంలోని రామవరం గ్రామ సచివాలయంలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సచివాలయం పరిధిలోని వలంటీర్లను ఎంపీపీ సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు పారదర్శకంగా పథకాలు అందుతున్నాయని, ఇటువంటి వ్యవస్థ దేశంలో మరెక్కడా లేదన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, సర్పం చ్ పీరుబండి పద్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ తీర్థం



మరిడిమాంబను దర్శించుకుంటున్న భక్తులు



పరుగుపోటీల్లో దౌడు తీస్తున్న గుర్రం

లక్కవరపుకోట: మండలంలోని రంగరాయపురంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న గ్రామ దేవత మరిడిమాంబ తీర్థం సోమవారం ప్రారంభమైంది. నిర్వాహకులు ఆలయాన్ని సుందరంగా అలంకరిం చారు. తొలిరోజు అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన అంతర్ జిల్లాల గుర్రాల పరుగు పందెం పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 16 గుర్రాలు పాల్గొన్నాయి. మొదటి అయిదు స్థానాల్లో నిలిచిన గుర్రాలకు సంబంధించిన యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. మంగళవారం అంతర్ జిల్లాల ఎడ్ల బళ్ల పరుగు పందెం పోటీలు నిర్వహించనున్నారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు, పథకాలు

- ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవంలో మంత్రి బొత్స



గరికివలస సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

గుర్ల: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు, ప్రభుత్వసేవలు ఇంటిముంగిటకే అందు తున్నాయన్నారు. మండలంలోని గరికివలసలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ కేంద్రం నూతన భవనాలను సోమవారం ఆయన ప్రారంభించా రు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. ప్రజలు మండల, జిల్లా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా గ్రామ సచివాలయాల ద్వారా సమస్యలను పరిష్కరిస్తుండడంతో పాటు ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గరికివలస గ్రామస్తులకు వివిధ పథకాల రూపంలో రూ.15 కోట్లు అందజేశామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ సమప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ప్రజలందరికీ మళ్లీ సంక్షేమ పథకాలు అందాలంటే సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు గ్రామాల్లోకి వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పి, బూటకపు హామీలు ఇస్తారని వారిని నమ్మి నష్టపోవద్దని ప్రజలకు సూచించారు. ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామంలోని 874 కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించామన్నారు.ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొత్స సందీప్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, జేసీఎస్ కన్వీనర్లు బెల్లాన బంగారునాయుడు, కెంగువ మధుసూదన రావు, సర్పంచ్ బెల్లాన సన్యాసమ్మ, ఎంపీడీఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.50 లక్షలతో సీసీ కాలువ నిర్మాణం



కాలువ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ కొండమ్మ వైస్ సర్పంచ్ రామునాయుడు

గజపతినగరం: మండల కేంద్రంలోని ఠాణా వీధి నుంచి చంపావతి నది వరకు ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టం పూర్తిగా పాడుబడడంతో దానిని డమ్మీ చేసి కొత్తగా సీసీ కాలువను నిర్మిస్తున్నామని స్థానిక సర్పంచ్,వైస్ సర్పంచ్‌లు నరవ కొండమ్మ, కర్రి రామునాయుడు తెలిపారు. కాలువ నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు రూ.3.50లక్షల పంచాయతీ నిధులతో కాలువను నిర్మిస్తున్నామని చెప్పారు. ఠాణా వీధి నుంచి చంపావతి నది వరకు ఉన్న అండర్ డ్రైనేజ్ సిస్టంని మూసివేసి మరో పక్క నుంచి సుమారు 8 అడుగుల లోతులో కాలువను నిర్మించి, దానిపైన సిమెంట్ పలకలు వేయనున్నామని తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సహాయ సహకారాలతో మండల కేంద్రంలో సీసీ రోడ్లు,కాలువలు, ఇతర అభివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి రమణ, వార్డు సభ్యులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తహసీల్దార్ సుదర్శన్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. పాచలవలస పోలింగ్ కేంద్రం వద్ద ర్యాంపు నిర్మించాలని ఆదేశించామని తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కె.రమేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రయాణికులు 99592 25619, 73829 23679 నంబర్లకు ఫోన్ చేసి తమ సమస్యలు, సలహాలు తెలియచేయవచ్చని పేర్కొన్నారు.

ఆధార్ ఆపరేటర్లకు శిక్షణ

విజయనగరం రూరల్: ఆధార్ సేవల్లో సాంకేతిక సమస్యలు, సందేహాల పరిష్కారాలపై గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఆపరేటర్లకు జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం శిక్షణ నిర్వహించారు. ఆ విభాగం జిల్లా సమన్వయకర్త జీఎస్ నిర్మలాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో ఆధార్ సేవలు అందించడంలో పాటించాల్సిన కొత్త మెలకువలు, ఆపరేటర్ల సందేహాలను కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన బాలప్రసాద్, వీవీఎస్ సుందరం నివృత్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారులు, జిల్లా సమన్వయకర్తలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నడక వంతెన ఏర్పాటు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మంగళపాలెం గ్రామస్తులు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలో ఉన్న రైల్వే లైన్ వద్ద నడక వంతెన ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గ్రామముఖం ద్వారం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న అండర్ పాసేజ్ నుంచి రాకపోకలు సాగించాలంటే 1.5 కిలోమీటర్లు నడవాల్సి వస్తోందన్నారు. అదే ప్రాంతంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి (నడక వంతెన) ఏర్పాటు చేయాలని కోరారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి



శృంగవరపుకోట: మాట్లాడుతున్న డాక్టర్ హారిక



గజపతినగరం: శిక్షణకు హాజరైన ఏఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు

శృంగవరపుకోట: మార్చి 3వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారులు జె.హారిక, శిరీష వైద్యారోగ్యశాఖ సిబ్బంది ని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పల్స్‌పోలియోపై కొట్టాం పీహెచ్‌సీ పరిధిలో 40 మంది ఆరోగ్య సిబ్బంది, 87మంది అంగన్ వాడీ సిబ్బంది, 54 మంది ఆశ కార్యకర్త లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా వైద్యాధికారు లు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి అయిదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని 6,646 మం ది పిల్లలకు చుక్కల మందు వేయాలన్నది లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. ఎస్.కోట పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాన్సిట్ పాయింట్ ఏర్పాటు చేస్తామని, మూడు రూట్లలో 72 గ్రామాల్లో ఈ కార్యక్రమం చేయాలని, ఒక మొబైల్ టీమ్ పర్యవేక్షి స్తుందని తెలిపారు. ఇటుక బట్టీలు, స్టోన్ క్రషర్లు, క్వారీలు వంటి ఆవాసాల వద్ద ఉన్న వలస కూలీల పిల్లలకు పోలి యో చుక్కలు వేసేలా చూడాలని కోరారు. తొలిరోజు పోలియో చుక్కలు వేయని పిల్లలకు, 4,5వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు వేయాలని సూచించారు. సీహెచ్‌ఓ ఎం.తారకరావు, సూపర్‌వైజర్లు రామసత్యం, ఎంపీహెచ్ ఈఓ సన్యాసినాయుడు, హెల్త్ అసిస్టెంట్లు టి.శంకరరావు, టి.రామకృష్ణ, జె.రాము, సీహెచ్.కృష్ణ, డి.తాతారావు పాల్గొన్నారు.

17 బూత్‌లు ఏర్పాటు

దత్తిరాజేరు: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో మార్చి 3వ తేదీన పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు 17 బూత్‌లు ఏర్పాటు చేశామని పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశ వర్కర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు ఆరోగ్య సిబ్బందికి పల్స్‌పోలియోపై సోమవారం శిక్షణ ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ అంతా కలిసి పల్స్‌పోలియోను విజయవం తం చేయాలని కోరారు. 3వ తేదీన చుక్కల మందు వేసుకునేందుకు అందుబాటులో లేని పిల్లలకు, 4,5వ తేదీల్లో ఇంటికి వెళ్లి చుక్కల మందు వేయాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

5,439 మంది పిల్లలకు...

గజపతినగరం: మరుపల్లి పీహెచ్‌సీ పరిధిలో అయిదేళ్ల లోపు పిల్లలు 5,439 మంది ఉన్నారని,వీరందరికీ మార్చి 3వ తేదీన తప్పక పోలియో చుక్కలు వేయాలని ఆ పీహెచ్‌సీ వైద్యాధికారు లు సాయికృష్ణారెడ్డి, అనూజ్ రాయ్ ఏఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. పీహెచ్‌సీ పరిధి ఏఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలకు పీహెచ్‌సీలో సోమవారం శిక్షణ ఇచ్చారు. చుక్కల మందు వేసేందుకు 54 బూత్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు.,సీహెచ్‌ఓ అప్పలనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన రోడ్డు పునరుద్ధరణ పనులు

- కొత్తవలస– విజయనగరం రోడ్డు విస్తరణ, పునరుద్ధరణకు రూ.4 కోట్లు మంజూరు



కొత్తవలస జంక్షన్‌లో ప్రారంభమైన రోడ్డు పునరుద్ధరణ పనులు

కొత్తవలస: మండల కేంద్రం నుంచి విజయగనరం రోడ్డులో కంటకాపల్లి రైల్వే ఫ్లెటైవర్ బ్రిడ్జి వరకు రోడ్డు పునరుద్ధరణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చొరవతో ఈ రోడ్డు పునరుద్ధరణకు ప్రభుత్వం రూ.4.01 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రస్తుతం 8 మీటర్ల వెడల్పు ఉన్న రోడ్డును 10 మీటర్లకు విస్తరించి, సుమారు 8 కిలోమీటర్ల మేర రోడ్డును పూర్తిగా పునరుద్ధరిస్తామని డీఈ శ్రీనివాసరావు తెలిపారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్డు పూర్తిగా పాడైపోయింది. రాకపోకలు సాగించేందు కు వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సివచ్చేది. సమస్యను ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా, అత్యవసర ప్రాధాన్యత నిధుల నుంచి రూ.4.01 కోట్లు మంజూరు చేసింది. పనులను శనివారం లోపు పూర్తి చేస్తామని డీఈ చెప్పారు.

వైభవంగా చండీహోమం



మహా చండీహోమంలో పాల్గొన్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం పంచాయతీ దేవునినెలివాడలో వెలసిన రాజరాజేశ్వరి ఆలయంలో మహా చండీహోమం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త లెంక రామయ్యమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాయజ్ఞంలో సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేద పండితుడు గొడుగుల వెంకటేషశర్మ తమ బృందంతో వేద మంత్రోచ్చారణల నడుమ హోమం ఘనంగా జరిపించారు. మధ్యాహ్నం సుమారు 5 వేల మంది భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. శ్రీరామ భజనబృంద ప్రతినిధి లెంక పైడినాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, సర్పంచ్ కంచరాపు సూర్యకళ, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి చిత్రపటాలు, ప్రసాదాలు అందజేశారు.